క్లుప్తంగా

ముగిసిన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు



అంగరలో వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 9న ఉత్సవాలు ప్రారంభం కాగా ఆలయ అర్చకులు దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. చివరి రోజు ఆదివారం గ్రామంలో స్వామివారిని ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

భీమేశ్వరుని దర్శించుకున్న మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజు



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న పళ్లంరాజు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం



హోంగార్డు వీరబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పిల్లి వీరబాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలికి గాయమైంది. రామచంద్రపురం ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం హసన్‌బాదలోని వీరబాబు ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. ఎస్సై, సిబ్బంది కలసి రూ. 50 వేలు అందించగా, పలువురు హోంగార్డులు కలసి రూ.10 వేలు సాయం అందజేశారు. వీరబాబు త్వరగా కోలుకుని విధులకు హాజరు కావాలని ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది ఆకాంక్షించారు. హెడ్ కానిస్టేబుల్ పెద్దింశెట్టి మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష శివలింగాల రూపకల్పనలో మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి



మట్టి శివలింగాలతో చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: అనపర్తి మండలం కుతుకులూరులో గ్రామస్తులు తలపెట్టిన లక్ష శివలింగాల రూపకల్పనలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి నేను సైతం అంటూ పాలుపంచుకున్నారు. గ్రామంలో వేంచేసిన పార్వతీ సమేత కూటేశ్వరస్వామి ఆలయం వద్ద మట్టితో లక్ష శివలింగాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం చైర్‌పర్సన్ దుర్గారాణి స్వామి వారిని దర్శించారు. మట్టి శివలింగాలను తయారు చేసి శివ భక్తిని చాటారు. ఈ బృహత్తర దైవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పరిసర గ్రామాల మహిళలు, చిన్నారులు, విద్యార్థులు శివలింగాల తయారీలో పాల్గొంటున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రమణ

మండపేట: బీజేపీ మండల అధ్యక్షుడిగా మారేడుబాకకు చెందిన పాలిక రమణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ తెలిపారు. ద్వారపూడిలోని రజక కమ్యూనిటీ హాలులో సాయిరామ్ ఆధ్వర్యంలో జరిగిన మండల అధ్యక్ష ఎన్నికల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గొడవర్తి రామచంద్రరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఇళ్ల సత్యనారాయణ, రాయి వీర్రాజు, బండారు సూరిబాబు, మురళీ, ఫణి, తెల్లాకుల శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇమామ్ హసన్ జయంతి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, రెండవ ప్రవక్త హజరత్ ఇమామ్ హసన్ జయంత్యుత్సవాన్ని నగరం గ్రామంలో ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా బడే బీబీ పంజాలో మిలాద్ నిర్వహించారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ ఇమామ్ హసన్ గొప్పతనాన్ని కొనియాడారు. ఇస్లాం మత చరిత్రలో ఇమామ్ హసన్ పాత్రను వివరించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షలు రాయనున్న 4,989 మంది విద్యార్థులు



రాయవరం: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఏడాది పాటు చదివిన అంశాలను మూడు గంటల్లో పేపరుపై రాసే సమయం ఆసన్నమైంది. విద్యార్థి తనను తాను నిరూపించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, ఉన్నత స్థితికి చేరడానికి విద్యార్థులు సన్నద్ధమయ్యారు. పదో తరగతి విద్యార్థులతో పాటు తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు ఇది పరీక్ష సమయమే.

రెండు నియోజకవర్గాల్లో 95 ఉన్నత పాఠశాలలు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 95 ఉన్నత పాఠశాలలున్నాయి. క్లస్టర్ పరిధిలో 4989 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనుండగా, మండపేట నియోజకవర్గంలో 2,942 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 2,047 మంది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 29 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. తొలి రోజు విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకుని, హాల్ టికెట్ నంబరు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చు.

అధికారుల నియామకం

పరీక్షల నిర్వహణలో తొలి రోజు నుంచి చివరి రోజు వరకు ఏ చిన్న పొరపాటుకూ తావీయవద్దని విద్యాశాఖ అధికారులు సూచించారు. క్లస్టర్ పరిధిలో 29 పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియామకం చేశారు. అలాగే 212 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించి, శనివారం వారికి అవసరమైన మార్గదర్శకాలను ఇచ్చారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

కె.గంగవరం: ఈ విద్యా సంవత్సరం మొదటి నుంచి ఇప్పటి వరకు కష్టపడి చదివిన పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి కౌన్‌డౌన్ ప్రారంభం కానుంది. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లో 453 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రానికి ముందుగా 8.30 గంటలకు విద్యార్థులు రావాలని ఇప్పటికే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సూచించారు. కె.గంగవరం మండలంలో 4 పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లు 40, చీఫ్ సూపరింటెండెంట్లు 4, డిపార్టుమెంట్ అధికారులు ముగ్గురుని జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించి దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

ఒత్తిడికి గురికాకూడదు

పరీక్షా సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురవ్వకుండా ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ముందు రోజు రాత్రి చదవకుండా మొదటి నుంచి చదివిన పాఠాలను మనస్సులో నెమరు వేసుకోవాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకుని విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలని, పరీక్షలు జరుగుతున్న రోజుల్లో పౌష్టిక ఆహారం పూర్తి స్థాయిలో అందించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు పరీక్షే

విద్యా సంవత్సరం మొదటి నుంచి ఉపాధ్యాయులు విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తగిన తర్ఫీదు ఇచ్చారు. చివరి 100 రోజుల్లో ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించి ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపారు. పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలాల వారీగా పదో తరగతి విద్యార్థులు, పరీక్ష కేంద్రాల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు
రాయవరం	13	696	04
రామచంద్రపురం	33	1,629	09
కె.గంగవరం	10	418	04
మండపేట	28	1,776	09
కపిలేశ్వరపురం	11	470	03
మొత్తం	95	4,989	29

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మండపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకూ జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి ఆదివారం తెలిపారు. మండపేట రూరల్, అర్బన్ పరిధిలో మొత్తం 1778 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 934 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 844 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా వీరిలో 867 బాలురు, 911 మంది బాలికలు ఉన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. పట్టణంలోని విద్యార్థులకు స్థానిక ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డాక్టర్ పాలడుగు సత్యవతి చంద్రమౌళి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ స్కూల్, గుమ్మిలేరు రోడ్డులోని భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రూరల్ పరిధిలో విద్యార్థుల కోసం ఏడిద జెడ్పీ హైస్కూల్, ద్వారపూడి జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లు, తాపేశ్వరంలో పోలిశెట్టి సత్తిరాజు భూషణం జెడ్పీ హైస్కూల్, శ్రీచైతన్య పాఠశాలల్లో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.

మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కాజులూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి డేవిడ్ అన్నారు. సోమవారం నుంచి మండలం పరిధిలోని గ్రామాల్లో పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్న కాజులూరు, గొల్లపాలెం, కుయ్యేరు పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి డేవిడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని కాజులూరు పరీక్ష కేంద్రంలో 271 మంది, కుయ్యేరు పరీక్ష కేంద్రంలో 142 మంది, గొల్లపాలెం పరీక్ష కేంద్రాలలో 181 మంది, పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలకు అన్నీ సిద్ధం చేసామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందని విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా మార్గదర్శకాలు జారీ చేశాం. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ వాడడానికి వీలు లేదు. గేటు వద్దే సెల్‌ఫోన్స్ డిపాజిట్ చేసి, పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలి.

పి.రామలక్ష్మణమూర్తి,
ఉప విద్యాశాఖాధికారి, రామచంద్రపురం

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు, జ్ఞాపికలు అందుకుంటున్న ద్రాక్షారామ జిమ్ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 15న పి.గన్నవరం ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్ వద్ద నిర్వహించిన ఉమ్మడి గోదావరి జిల్లాల స్థాయిలో పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలో ద్రాక్షారామకు చెందిన శాకా వీరభద్రరావు జిమ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. జిమ్ విద్యార్థులు వెలంపాలెంకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ దొమ్మేటి నాగేశ్వరరావు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, బెంచ్ ప్రెస్ మాస్టర్స్ విభాగంలో ద్రాక్షారామకు చెందిన దవులూరి రామకృష్ణ నాగేశ్వరరావు (డీఆర్‌కే) ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, బెంచ్ ప్రెస్ 64 కేజీల విభాగంలో ఉప్పెల్లికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, 83 కేజీల విభాగంలో వెలంపాలెంకు చెందిన పిల్లి రాంబాబు ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం, 93 కేజీల విభాగంలో అన్నాయిపేటకు చెందిన నక్కా భీమశంకరం (ఎన్‌బీఎస్) తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధించారు. విజేతలను వీరభద్ర జిమ్ కోచ్ పొట్టిపోతుల రామకృష్ణ, గుడాల లక్ష్మీనారాయణ, అడవి కుమార్, మీసాల బాలరాజు తదితరులు అభినందించారు.

శిథిలావస్థలో కాటన్ దొర బంగ్లా



జగన్నాథగిరిలోని కాటన్ దొర బంగ్లా

కాజులూరు: జగన్నాథగిరిలోని ఇరిగేషన్ కార్యాలయానికి (కాటన్ దొర బంగ్లాకు) మరమ్మతులు చేపట్టాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు. 143 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పురాతన భవనం ఒక చారిత్రక ఆధారంగా ఉంది. అప్పటి బ్రిటీష్ పాలకుల కాలంలో 1850 – 1870 మధ్య కాలంలో విశ్రాంతి తీసుకోవడానికి వారు గెస్టుహౌస్‌గా ఈ బంగ్లాను నిర్మించారు. ధవళేశ్వరం ఆనకట్ట, కాలువల నిర్మాణాల్లో భాగంగా తరచూ ఇటుగా ప్రయణించే సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఈ బంగ్లాను విశ్రాంతి మందిరంగా వాడుకునేందుకు అభివృద్ధి చేశాడు. ఇందుకోసం బంగ్లా సమీపంలో వాచ్‌మెన్ గది, గుర్రపుశాలను నిర్మించారు. అప్పట్లో రవాణా సౌకర్యాలు అంతగా లేకపోవటంతో బ్రిటీష్ అధికారులు పంట కాలువల ద్వారా పడవలు, బోట్లలో వచ్చి కోరంగి కెనాల్ పక్కనే ఉన్న బంగ్లాలో విశ్రాంతి తీసుకునేవారు. కాలక్రమేణా స్వాతంత్ర్యానంతరం ఈ బంగ్లా ఇరిగేషన్ కార్యాలయంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ఇది జగన్నాథగిరి సెక్షన్ ఇరిగేషన్ ఆఫీస్‌గా సేవలందిస్తోంది. గుర్రపుశాల, వ్యాచ్‌మెన్ గది శిథిలావస్థకు చేరాయి. బంగ్లా, గోడలు పటిష్టంగా ఉన్నప్పటికీ పైకప్పు అక్కడక్కడా శిథిలావస్థకు చేరుకుంది. గత కాలపు జ్ఞాపకాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడానికి శిథిలమవుతున్న ఈ బంగ్లాకు అధికారులు మరమ్మతులు చేయించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీవరప్రకాష్‌కు మాతృవియోగం



చుండ్రు అనంతలక్ష్మి (ఫైల్)

మండపేట: మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ తల్లి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పారిశ్రామిక వేత్త చుండ్రు గోవిందరాజు సతీమణి అనంతలక్ష్మి (70) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు నెల రోజుల క్రితం గుండె సమస్య రావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. ఆమెకు కుమారుడు శ్రీవరప్రకాష్, కుమార్తె వల్లూరి లావణ్య ఉన్నారు. ఆమె మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు, కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు రెడ్డి రాధాకృష్ణ, సంతాపం తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.సాయికుమార్‌బాబు, కౌన్సిలర్లు శిరంగు జ్యోతి, కాళ్లకూరి స్వరాజ్య భవాని, చింతలపూడి దుర్గ, తదితరులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మండపేట: పట్టణంలోని 22వ వార్డు మేథరపేటకు చెందిన సూరా రాంబాబు (59) అనుమానాస్పద స్థితిలో తన ఇంట్లో మృతి చెందాడు. ఆయన సోదరుడు సూరా పండు ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ దారం సురేష్ కథనం ప్రకారం.. మృతుడు రాంబాబు కుమార్తె వస్త్రాల వెంకటదుర్గ పట్టణంలోని తండ్రి ఇంట్లోనే ఉంటోంది. కాగా ఈ నెల 15న రాంబాబు తన ఇంటిలోని మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. తన అన్నయ్య ఎలా చనిపోయడని మృతుడి కుమార్తె వెంకటదుర్గను పండు ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పింది. కేసు పెట్టి పోస్టుమార్టం చేయిస్తే తాను చనిపోతానని బెదిరించింది. ఘటనపై సోదరుడు పండు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సురేష్ తెలిపారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

కాజులూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆనాడు పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు చేసిన త్యాగాలను ప్రజలు నిరంతరం స్మరించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు వరదా శేషారావు అన్నారు. మండలంలోని కోలంకలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ తెలుగుజాతి అభ్యున్నతి కోసం పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ అవతరణను సాకారం చేశారని అన్నారు. కేసీఆర్ వంటి నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం విభజన వాదాన్ని తెరపైకి తీసుకువస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, చంద్రబాబు వంటి నాయకుల మద్దతు తీసుకుని ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని రెండుగా చీల్చి తెలుగుజాతిని విడదీశారన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రాజ, సంఘ నాయకులు వరద వెంకటేశ్వరరావు, భలబద్రుని మల్లేశ్వరరావు, నూలు వాసు, మన్యం జయచంద్రబోస్, బొడ్డు చంద్రశేఖర్, భలబద్రుని సుబ్బారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

రామచంద్రపురం రూరల్: ఏలూరులో ప్రైవేటు ట్రావెల్ బస్సుకు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయాలపాలైన బాధిత సంబంధీకులు ఆదివారం ద్రాక్షారామలో రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సును నిలిపివేశారు. యానాం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఈ బస్సును అడ్డగించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జుత్తుక భవాని ఫ్లెక్సీని వాహనానికి తగిలించి ఆందోళన చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయకుండా ఆ ట్రావెల్స్‌కు చెందిన బస్సులను తిరగనీయమని అన్నారు.

అభివృద్ధికి కూటమి తూట్లు



ప్రారంభానికి నోచుకోని రైతు బజార్‌లో పెరుగుతున్న తుప్పలు



పట్టణంలో రుడా నిధులతో నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా ఆగిన పార్కు అభివృద్ధి పనులు

- రామచంద్రపురంలో రైతు బజార్‌కు మోక్షమెప్పుడో ?
- అసంపూర్తిగా ఆగిన పార్కుల అభివృద్ధి పనులు

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా 10 నెలల కాలం గడుస్తోంది. అభివృద్ధే మా ధ్యేయం అంటూ గొప్పలు చెప్పుకునే కూటమి నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధి పట్టణాభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. కనీసం గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఖర్చు చేయడంలో నిరంకుశంగా వ్యవహరిస్తూనే గతంలో నిర్మించిన భవనాలను సైతం ప్రారంభించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పట్టణవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

పట్టణంతో పాటుగా చుట్టు పక్కల గ్రామాల ప్రజల వెతలు తీర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మార్కెట్ కమిటీ నిధుల నుంచి పట్టణంలోని శివాలయం వీధిలో గల మున్సిపాలిటీ స్థలంలో సుమారు రూ.కోటి నిధులతో రైతు బజార్ నిర్మాణాన్ని చేపట్టారు. కూరగాయల వ్యాపారులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి కూరగాయలు పండించి తీసుకువచ్చే రైతులకు, వివిధ వాణిజ్య వర్తక వ్యాపారులకు అనువుగా ఉండేందుకు ఈ రైతు బజార్ నిర్మాణాన్ని చేపట్టారు. మున్సిపాలిటీలో ప్రజల కష్టాలను తీర్చేందుకు అప్పట్లో యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేయించి రైతు బజార్‌ను నిర్మించారు. ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో ప్రారంభోత్సవ కార్యక్రమం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా రైతు బజార్‌ను ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలనే తలంపు మాత్రం స్థానిక నేతలకు గుర్తుకు రావటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో కాలంగా రైతుల బజార్ కోసం ఎదురుచూస్తున్న పట్టణ వాసుల కోరికను తీర్చేందుకు అప్పటి మంత్రి వేణుగోపాలకృష్ణ చేసిన ప్రయత్నం కార్యరూపం దాల్చినా ప్రజలకు అందకుండా ఈ కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైతు బజార్ పూర్తి చేసుకుని ఏడాది కాలం గడుస్తుండటంతో షెడ్లు నిర్మించిన చోట పిచ్చిమొక్కలు మొలిచి ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారే అవకాశం ఉందని పట్టణ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా రైతు బజార్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కుల అభివృద్ధికి మోకాలడ్డు

ప్రస్తుత ఉరుకుల పరుగుల ప్రజాజీవనంలో పట్టణ వాసులకు పార్కులు ఎంతో కొంత సేదతీరేందుకు ఉపకరిస్తుంటాయి. పట్టణవాసులకు పార్కులను అందుబాటులోకి తీసుకురావాలని గత ప్రభుత్వం అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో సుమారుగా రూ.2 కోట్ల నిధులను రాజమండ్రి అర్బన్ డవలెప్‌మెంట్ (రుడా) నుంచి తీసుకువచ్చారు. ఈ నిధులతో మూడు చోట్ల కొత్త పార్కుల నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. దీంతో పార్కుల నిర్మాణాలను అప్పట్లో ప్రారంభించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పార్కుల నిర్మాణ పనులను నిలుపుదల చేయటంతో పాటు అర్బన్ డవలెప్‌మెంట్ (రుడా) నుంచి నిధులను ఏం చేశారో కూడా తెలియలేదు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వచ్చిన నిధులను సైతం ఖర్చు చేయకుండా పార్కుల అభివృద్ధిని అడ్డుకోవటం దారుణమని పట్టణ వాసుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంపై కక్ష సాధించుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చకుండా అడ్డుకోవటం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు. రుడా నుంచి వచ్చిన నిధులను వినియోగించుకుని పార్కుల అభివృద్ధిని తిరిగి ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

మోతాదుకు మించితే ముప్పే

- రక్షణ పరికరాలు లేకుండా పిచికారీ చేస్తే రైతన్నలకు ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న అన్నదాత

రాయవరం: రబీ సీజన్‌లో రైతులు అధికంగా పురుగు మందుల వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ అవసరం లేకున్నా రసాయన ఎరువులు, పురుగు మందులను రైతులు స్ప్రే చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం బాగా పెరిగిపోతోంది. విత్తనాలు చల్లడం మొదలు పురుగు మందుల పిచికారీ వరకు రైతులకు సరైన అవగాహన ఉండడం లేదు. దీంతో కొందరు రైతులు పంటలపై ఎక్కువ మోతాదులో పురుగు మందులు, రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. ఫలితంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కలుపు మొక్కల నివారణకు విత్తనాలు వేసిన వెంటనే పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో పురుగు నివారణ మందులు వినియోగం పెరగడంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటోంది. మందులు అధికంగా వినియోగించడంతో భూసారం తగ్గడంతో పాటు భూమిలో ఉన్న మేలు చేసే వానపాములు వంటి జీవులు చనిపోతున్నాయి.

ప్రధానంగా రైతులు వరి, కూరగాయల పంటల్లో క్రిమి సంహారక మందులను వినియోగిస్తున్నారు. ఈ మందులను ట్యాంకుల్లో కలిపే సమయంలో, పిచికారీ చేసే సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలి. తలకు హెల్మెట్, ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించి మందులను పిచికారీ చేయాలి. 25 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద స్ప్రే చేయడం ప్రయోజనకరం. పంటలకు తడి అందించిన అనంతరం ఉదయం వేళల్లోనే పురుగు మందులు పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...

పురుగు మందు పిచికారీ చేస్తున్న సమయంలో రైతులు, కూలీలు..సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగరాదు. కళ్లు, నోరు, ముక్కు, ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా చేతులతో రుద్దరాదు. భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. మందులను పిచికారీ చేసిన తర్వాత ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతుక్కోవాలి. రసాయన ప్రభావానికి లోనైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. పిచికారీ సమయంలో శరీరం కన్పించకుండా రక్షణ దుస్తులు ధరించాలి. పురుగు మందులు కలిపిన ద్రావణం డబ్బా, సీసాలను కాలువల్లో, చెరువుల్లో వేయరాదు. ఆ నీటిని తాగరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలను రంధ్రం చేసి దూరంగా ఉంచాలి. క్రిమి సంహారక మందులను ఉదయం , సాయంత్రం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి. గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయరాదు.

తగిన జాగ్రత్తలు అవసరం



రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్కులు లేకుండా మందును పిచికారీ చేయరాదు. పంటలపై సరైన మోతాదులో మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించుకోవాలి. లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంది.

కొప్పిశెట్టి ప్రభాకర్,
మండల వ్యవసాయాధికారి, రాయవరం